క్లుప్తంగా

నిబంధనలు తప్పనిసరి

వికారాబాద్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌శర్మ

మొయినాబాద్‌రూరల్: గురుకులాల ప్రవేశానికి 5వ తరగతి పరీక్ష రాసే విద్యార్థులు నిబంధనలు పాటించాలని వికారాబాద్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌శర్మ తెలిపారు. మండల కేంద్రంలోని తోల్‌కట్ట సమీపంలో గల వికారాబాద్ డిగ్రీ కళాశాలలో ఆదివారం విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఉ.11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షా కొనసాగుతోందని చెప్పారు. పరీక్ష రాసే విద్యార్థులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ గంట ముందే హాజరుకావాలని తెలిపారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తాం

వీఓఏల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు రమ

కందుకూరు: వీఓఏల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని ఆపేదిలేదని వీఓఏల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు ఎస్‌వి.రమ తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన సమ్మె శనివారంతో ఆరవ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిరసన తెలిపారు. కాగా వీరికి ఆమె మద్దతు తెలిపి మాట్లాడారు. 19 ఏళ్లుగా వీఓఏలు సమర్థవంతంగా సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నా వారిని పట్టించుకోవడం లేదన్నారు. వీఓఏలకు కనీస వేతనం అమలు చేయడంతో పాటు వారిని క్రమబద్ధీకరించి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మరో పక్క కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ లేబర్ కోడ్‌ను తీసుకొస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో గ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జి.కవిత, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆలువాలు రవికుమార్, సీఐటీయూ మహేశ్వరం, కందుకూరు మండలాల కన్వీనర్లు ఏర్పుల శేఖర్, బుట్టి బాలరాజు, శివలీల, సరస్వతి, సంగీతలక్ష్మి, పద్మ, రాంచంద్రారెడ్డి, రమేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

బీరప్పస్వామికి ప్రత్యేక పూజలు



హోమం చేస్తున్న భక్తులు

రాజేంద్రనగర్: హైదర్‌గూడ ఎర్రబోడలో బీరప్ప స్వామి జాతరలో భాగంగా శనివారం హోమం, బీరప్ప గుడి మైలలు, గంగతెప్ప తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం దేవాలయ ఆవరణలో చేసిన హోమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆదివారం బీరప్పస్వామి కామరాతి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ సందర్భంగా దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాతర కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు. హైదర్‌గూడ పరిసర ప్రాంతాలకు చెందిన కురుమ కులస్తులు సాయంత్రం సామూహిక బోనాలతో దేవాలయానికి రానున్నారు. ఐదు సంవత్సరాల అనంతరం ఈ పండుగను చేపడుతున్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని రోటరీ క్లబ్, ఐసీఏఆర్ (చిరుధాన్యాల పరిశోధన సంస్థ),ఐఐఎం,శంకర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేశారు. కంటి శుక్లాలు ఉన్న 15 మందిని గుర్తించి ఈ నెల 30న శంకర్ కంటి వైద్యశాలలో ఆపరేషన్ చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ డైరెక్టర్ సత్యవతమ్మ, వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ పరిశోధన సంచాలకులు డాక్టర్ జగదీశ్వర్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అమిత్‌షా సభను విజయవంతం చేయాలి

రాజేంద్రనగర్: చేవెళ్లలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేపీ అధికార ప్రతినిధి, శక్తి కేంద్రం ఇన్‌చార్జీ రాచూరి రాజశేఖర్ కోరారు.ఇందుకు సంబంధించి అత్తాపూర్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, మునీందర్, చరణ్, ప్రసాద్, అంకూర్, బన్సల్, రామమూర్తి, యాదయ్య, శివ, సంతోష్, వర్మ, నేమిచంద్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల సభకు తరలిరండి..

మణికొండ: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాక సందర్భంగా ఆదివారం చేవెళ్లలో ఏర్పాటు చేస్తున్న భారీ బహిరంగసభకు మణికొండ మున్సిపాలిటీ నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లాలని బీజేపీ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి అంజన్ కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం మణికొండ పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్ రెడ్డి, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు సి.బీరప్ప, కౌన్సిలర్‌లు బి.శ్వేత రవికాంత్‌రెడ్డి, ఎల్. వందన నగేష్, కోఆప్షన్ సభ్యులు జె.సిద్దప్ప, జె.లక్ష్మీరాములు, నాయకులు ఇందిర, రాఘవరెడ్డి, అనితాదేవి, వెంకటయ్య చారి పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక రంజాన్

ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

రంజాన్ పండుగ సందర్భంగా శనివారం షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా ఈద్గాలకు ప్రజాప్రతినిధులు హాజరై మాట్లాడారు. రంజాన్ పండుగ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోందని చెప్పారు. ప్రజల్లో భక్తిభావం, సోదరభావాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ఈద్గాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు..

– సాక్షి, నెట్‌వర్క్



షాద్‌నగర్: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



షాబాద్: శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి, తదితరులు



చౌదరిగూడలో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు



మొయినాబాద్‌రూరల్‌లో.. శుభాకాంక్షలు తెలియజేస్తున్న వెంకట్‌రెడ్డి



షాబాద్: ఏట్ల ఎర్రవల్లిలో లీగల్ అడ్వైజర్ సతీష్‌రెడ్డి..



కేశంపేట: నిర్దవెల్లి ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు



మొయినాబాద్: హోంమంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీటీసీ శ్రీకాంత్



కొత్తూరు: శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు



మొయినాబాద్: శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్

క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌రూరల్: క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనంలో మాజీ సర్పంచ్ రాఘుపురం పాల్‌రెడ్డి జ్ఞాపకార్థం కమ్మదనం క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు శనివారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలన్నారు. స్నేహపూర్వక వాతావరణానికి క్రీడలు దోహదం చేస్తాయని చెప్పారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, ఓటమిని విజయానికి పునాదిగా మలుచుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు ప్రతిభకు పదును పెట్టేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ప్రతినిత్యం క్రీడలను సాధన చేయడంతో మేధోశక్తి పెరుగుతుందని చెప్పారు. క్రీడాకారులు గ్రామీణ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింలు, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, నాయకులు నారాయణరెడ్డి, యాదగిరిగౌడ్, కిరణ్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి




ఈద్గాను ప్రారంభిస్తున్న రవీందర్ యాదవ్

ఎంపీపీ రవీందర్ యాదవ్

కేశంపేట: ప్రజలు పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎంపీపీ ఎల్గనమోని రవీందర్ యాదవ్ అన్నారు. మండలంలోని కొత్తపేటలో ఈద్గా, ఖబ్రస్తాన్‌ల మరమ్మతులతో పాటు బోరును తన సొంత ఖర్చులతో ఎంపీపీ రవీందర్ యాదవ్ చేయించారు. రంజాన్ పండుగ సందర్భంగా శనివారం ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని కులాల వారికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అనంతరం ఈద్గా వద్ద ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపేట, కేశంపేట గ్రామాల సర్పంచులు నవీన్‌కుమార్, తలసాని వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో పల్లకీ సేవ

షాద్‌నగర్: మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్ట హనుమాన్ ఆలయంలో శనివారం కౌన్సిలర్ పులిమామిడి లతాశ్రీ, శ్రీశైలంగౌడ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వామివారి పల్లకీ సేవ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు రఘుపతిరావు, ప్రమోద్, సునీల్ స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కుమార్‌గౌడ్, వసంతరావు, రఘుగౌడ్, రమేష్, నర్సింలు, రఘు



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

నందన్‌రెడ్డి, లక్ష్మణ్, కిషన్‌నాయక్, నారాయణ, శ్రీనివాస్, కృష్ణయ్య పాల్గొన్నారు.

చేవెళ్ల ప్రజలకు రుణపడి ఉంటాం

- ఇంద్రారెడ్డి ఆశయ సాధనకోసం పనిచేస్తాం
- మంత్రి సబితారెడ్డి

చేవెళ్ల: చేవెళ్ల ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటామని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం కౌకుంట్లలోని ఆయన సమాధి వద్ద తనయులు కార్తీక్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. స్వర్గీయ ఇంద్రారెడ్డి ఆశయాలు ఒక్కటొక్కటిగా నెరవేరుతున్నాయని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్, కౌకుంట్ల సర్పంచ్ గాయత్రి, ఉప సర్పంచ్ ఇనాయత్, ఇతర నాయకులు పాల్గొ న్నారు. చేవెళ్లలో ఇంద్రారెడ్డి విగ్రహానికి ఎంపీపీ ఎం.విజయలక్ష్మి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దామరగిద్దలో సర్పంచ్ ఎం.వెంకటేశంగుప్తా ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.



కౌకుంట్లలో ఇంద్రారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: ఉమ్మడి రాష్ట్ర హోం మంత్రిగా పని చేసిన స్వర్గీయ పి.ఇంద్రారెడ్డి చేవెళ్ల ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడని సబితారెడ్డి అన్నారు. ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంద్రారెడ్డి ఆశయ సాధనకోసం పని చేస్తామని అన్నారు. చేవెళ్ల ప్రజలు ఇంద్రారెడ్డి కుటుంబాన్ని ఎప్పటికీ ఆదరిస్తారని, వారికి తమ కుటుంబం రుణపడి ఉందన్నారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ గునుగుర్తి నక్షత్రం, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ కొంపల్లి అనంతరెడ్డి, సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి, మైనార్టీ విభాగం నాయకుడు షేక్ మహబూబ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రవూఫ్, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ మోర శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. చిలుకూరులో మాజీ సర్పంచ్ పురాణం వీరభద్రస్వామి, ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అకాల వర్షం.. రైతులకు అపార నష్టం

- భారీగా నష్టపోయిన పాలీహౌస్ రైతులు
- వడగళ్ల వానతో దెబ్బతిన్న పలు పంటలు
- పంటలు,పాలీహౌస్‌లను పరిశీలించిన ఎమ్మెల్యే కాలె యాదయ్య



చనువెళ్లిలో కూలిన పాలీహౌస్ షెడ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, ఏఓ తులసీ, నాయకులు

చేవెళ్ల: మండలంలో శుక్రవారం కురిసిన అకాల వడగళ్ల వాన, భారీ ఈదుర గాలులకు మండలంలోని పామెన, చనువెళ్లి, అల్లవాడ గ్రామాల్లో పాలీహౌస్ రైతులు, కూరగాయల రైతులు తీవ్రంగా నష్టపోయారు. అకాల వర్షం రైతులకు తీరని నష్టం మిగిల్చింది. చనువెళ్లి, అల్లవాడ గ్రామాల్లో దాదాపు 14 పాలీహౌస్‌లు భారీ ఈదురగాలులకు షెడ్‌లు కూలిపోయాయి. శనివారం అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి నష్టపోయిన పంటల వివరాలను సేకరించారు. చనువెళ్లిలో 160 ఎకరాలు, పామెనలో 72 ఎకరాలు, అల్లవాడలో 83 ఎకరాల్లో కూరగాయలు (జెర్బారా పూలతోటలు, క్యారెట్, బీట్‌రూట్, టమాట, కీర) ఇతర పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక అంచన వేశారు. నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు చెప్పారు.

పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే కాలె యాదయ్య

అకాల వర్షానికి దెబ్బతిన్న పాలీహౌస్‌లను, పంట పొలాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే కాలె యాదయ్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పామెన, అల్లవాడ, చనువెళ్లి గ్రామాల్లోని రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. లక్షల రూపాయలు పెట్టి సాగు చేస్తున్న పాలీహౌస్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. షెడ్‌లు పూర్తిగా పాడైపోయాయని, మళ్లీ వీటిని నిర్మించుకోవాలంటే లక్షల రూపాయల ఖర్చు అవుతుందని, ఇప్పటికే చాలా మంది రైతులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీ కూడా రాలేదని వాటి అప్పులే ఇంకా తీరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని చెప్పారు. ఆయన వెంట ఆయా గ్రామాల సర్పంచులు మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భీమయ్య, ఎంపీటీసీ సత్యనారాయణ చారి, వివిధ గ్రామాల బాధిత రైతులు ఉన్నారు.

షాబాద్ మండలంలో గాలి దుమారం

షాబాద్: మండలంలోని హైతాబాద్, పెద్దవేదు, మద్దూరు గ్రామాల్లో గాలి దుమారంతో శుక్రవారం రాత్రి విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. పశువుల పాకలు కుప్పకూలాయి. ఆయా గ్రామాల సర్పంచ్‌లు శనివారం కూలిపోయిన పశువుల పాకలు, చెట్లు, విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. అనంతరం విషయాన్ని అధికారులకు తెలియజేశారు.



షాబాద్: పెద్దవేదులో పడిపోయిన చెట్లను పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్

పుస్తకావిష్కరణ

రాజేంద్రనగర్: కవి, రచయిత మన్నె మహాత్మారావు రచించిన రుద్ర నమక చమక భువన తారక పరమార్థం పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. భవానీ కాలనీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గోకరి అర్జున్‌గౌడ్, సాహితీరత్న వేము వందనంలు హాజరయ్యారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి నీలకంఠం, అశోక్‌కుమార్, డాక్టర్ శ్రీరాములు, కృష్ణ, ఉమారెడ్డి, ఈశ్వర్, సతీష్, రామారావు, కృష్ణమూర్తి, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' డబ్బులు సకాలంలో చెల్లించాలి



ఉపాధికూలీలతో మాట్లాడుతున్న శ్రీనునాయక్

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్

షాద్‌నగర్: ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు ప్రభుత్వం సకాలంలో కూలీ డబ్బులు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండలంలోని బూర్గులలో ఉపాధిహామీ పనులు చేస్తున్న ప్రదేశాన్ని కార్మిక సంఘం నాయకులు సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు ప్రతివారం డబ్బులు చెల్లించాల్సి ఉంది. కానీ, సరైన సమయానికి కూలీ డబ్బులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం కూలీల పొట్టకొట్టే విధంగా వ్యవహరించడం సరికాదని చెప్పారు. కూలీలు పని చేసే ప్రాంతంలో మంచినీరు, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కూలీలకు బీమా సౌకర్యం కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కొలతలతో సంబంధం లేకుండా కూలీ డబ్బులు ఇవ్వాలని, ఉదయం సాయంత్రం ఫొటోలు తీసే పద్ధతిని రద్దు చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, సత్తయ్య గౌడ్, లాలయ్య, సత్తయ్య, బుచ్చిరెడ్డి, అంజయ్య, చంద్రకళ, భాగ్యమ్మ, రాములమ్మ, పద్మమ్మ, సంతోష, పర్వతమ్మ, అంజమ్మ, రాజు, శ్రీను పాల్గొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డికి మాతృవియోగం

మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య నివాళి

చేవెళ్ల: మండలంలోని తలారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పట్లోళ్ల పార్వతమ్మ(83), అనారోగ్యంతో శనివారం మధ్నాహం మృతి చెందారు. మండలంలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. డీసీఎంఎస్ చైర్మన్ పి. కృష్ణారెడ్డికి మాతృమూర్తి, మంత్రి సబితారెడ్డికి వదిన వరుస అవుతుంది. చేవెళ్లలో ఇంద్రారెడ్డి వర్ధంతికి వచ్చిన మంత్రి సబితారెడ్డికి విషయం తెలియడంతో ఎమ్మెల్యే కాలె యాదయ్యతో పాటు ఆసుపత్రి వద్దకు చేరుకొని ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డిని ఓదార్చారు. అక్కడి నుంచి మృతదేహాన్ని తలారం గ్రామానికి తరలించారు. ఆమె అంత్యక్రియలు తలారం గ్రామంలో ఆదివారం జరుగుతాయని తెలిపారు.



నివాళులర్పిస్తున్న సబితారెడ్డి, ఎమ్మెల్యేయాదయ్య తదితరులు